
# ఏరుదాటాక

— కె. శ్రీకృష్ణ బహదూర్




‘‘పీపీ ఫ్లాట్స్‌లో లైట్లు ఒక్కొక్కటే వెలగనారంభించాయి.

సాయంత్రం ఆరూ ముప్పావు అయ్యింది. ప్లే గ్రౌండ్స్‌లో ఆటలు ఆపేసి, పిల్లలందరూ క్రికెట్ బేట్లు, స్టంపులు, క్రికెట్ బాల్స్, రకరకాలు పట్టుకుని నవ్వుకొంటూ, మాట్లాడుకొంటూ, గొప్పలు చెప్పుకొంటూ వస్తున్నారు.

ఆడ పిల్లలు వాళ్లకంటే ముందే ఇళ్లకి చేరుకున్నారు.

ప్రతి ఇంట్లో ఆడవాళ్లు ఇరుగు పొరుగు ఇళ్లలో హస్కు, గాసిప్ ఫ్రెండ్లీ అడ్వైస్ అన్నీ పూర్తి చేసుకుని వంట పనులు ప్రారంభించారు. మగవాళ్లు ఆఫీసు నుంచి వచ్చాక కాఫీ, టీ, స్నాక్స్ వగైరాలు స్వీకరించి ఆఫీసు న్యూస్ పేపర్లు, పత్రికలు చదవటం అయ్యిందనిపించి, టీవీలు ఆన్ చేసి నెమ్మదిగా కుర్చీల్లో, సోఫాల్లో వెనక్కివాలి రిలాక్స్ అవుతున్నారు.

గోపాలంగారింట్లో కూడా టి.వి. ఆన్ అయింది.

గోపాలంగారు సోఫాలో సర్దుకుని టి.వికి కళ్లప్పగించబోతూ కూతురు సీత కోసం అటూ ఇటూ కళ్లు తిప్పి చూశారు. లేదు.

రోజూ తనకి కంపెనీగా కూర్చుని చూసే కూతురు లేకపోవడం వెలితిగా ఉంది.

భార్య శాంత వంట గదిలో చప్పుళ్లు చేస్తోంది. ఆవిడ మూకుడులో కూర వేయిస్తోందంటే ఆ చప్పుడు స్టంట్ సినిమాల్లో క్లైమాక్స్ ఫైట్‌లో వచ్చే భీకర ధ్వనుల కంటే ఘోరంగా ఉంటుంది.

ఆయనొక పెడబొబ్బ పెట్టారు.

‘‘శాంత’’

వంట గదిలోంచి అట్లకాడ చేతిలో పట్టుకుని ఒక్క దుముకులో వచ్చింది శాంత.

‘‘ఏమైందండీ?’’ అంది కంగారుగా.

‘‘సీత ఏది?’ అన్నారాయన.

‘‘అందుకా అరిచారు. ఏ హార్ట్ అటాకో వచ్చిందనుకున్నా’’ అందావిడ.

‘‘ఆఁ. నువ్వు చేసే ఆ వంట చప్పుళ్లకి ఎప్పుడో భరించలేక నిజంగానే గుండె పోటు వస్తుందిలే’’.

‘‘సరేలెండి. ఇంతకూ ఎందుకలా అరవడం?’’

‘‘నాకు గుండెపోటు వస్తే నీకు సరేనా! నా ఖర్మ. అరవకేం చెయ్యమంటావ్ ఇటు టీవీ చప్పుడు అటు నీ వంట మ్యూజిక్‌లో మెల్లగా పిలిస్తే నీకు వినబడదు. అందుకే అలా అరవడం’’ అన్నారాయన.

‘‘నా మ్యూజిక్కి ఏమీ గుండె పోటురాదు కానీ, మీ అరుపులకి మీరేదడుచుకుని ప్రాణం మీదకి తెచ్చుకుంటారు’’ అంది శాంత. శాంతకి తన పేరుకర్థం ఏమిటో తెలీదు. ఎప్పుడూ మాటకి మాట చెప్తూ మాటల పోరాటం చేస్తుందావిడ.

‘‘ఇంతకీ సీత ఏదే?’’

‘‘పూజా వాళ్లింటికి వెళ్లింది’’

‘‘ఎందుకూ’’

‘‘ఏదో నవల తెచ్చుకుంటానని వెళ్లింది’’.

‘‘ఏమిటో సీత పుస్తకం చదవడమే! దానికి టెక్స్ట్ బుక్స్ అయినా, నవలలు అయినా, వారపత్రికలైనా, ఏవి చదివినా అయిదు నిముషాల్లో నిద్ర వస్తుంది కదే. అది నవలలు తెచ్చుకోవడమేమిటి?’’. ఆశ్చర్యంగా అడిగారు గోపాలంగారు.

‘‘ఏమో మరి?’’ అంది శాంత

చిన్న న్యూస్ పేపర్ కూడా చదవని కూతురు నవల చదవడమేమిటీ అని గోపాలంగారికి ఆశ్చర్యంగా ఉంది.

ఆ పూజగారి పిల్లలు తెగపుస్తకాలు చదువుతారు. వాళ్ళు సీతకి ఏదో పుస్తకం మీద ఆసక్తి కలిగించి ఉంటారు. వాళ్ళు దీనికి ఫ్రెండ్స్. ఒకే వయసు అమ్మాయిలు.

గోపాలంగారికి ఆ అమ్మాయిల పేర్లు గుర్తొచ్చి నవ్వొచ్చింది. పూజగారికి దైవభక్తి విపరీతం. ఆ భక్తి పారవశ్యంలో తన ఇద్దరాడపిల్లలకీ ప్రార్థన, కీర్తన అని పేర్లు పెట్టుకుంది. గోపాలంగారి అబ్బాయి రవి జోక్ చేశాడు కూడా.

ఈ రవి వస్తే బాగుణ్ను. వెళ్ళి దాన్ని పిల్చుకురా అని చెప్పొచ్చు!

ఆయన అనుకుంటూండగానే రవి క్రికెట్ బేట్, ఒక స్టంప్ పట్టుకుని ఇంటి లోపలికి వచ్చాడు.

‘‘నాన్నా ఇవ్వాళ నేను...’’ ఏదో చెప్పబోయాడు రవి.

‘‘అది సరేగాని. అక్క పూజగారింట్లో ఉంది. వెళ్ళి పిలు’’ అన్నారు గోపాలంగారు.

‘‘నా మాట వినరే’’ విసుక్కున్నాడు పద్నాలుగేళ్ళ రవి.

‘ఆఁసరేలే. ఏదో సిక్సర్ కొట్టి ఉంటావు’’ అన్నారు గోపాలంగారు.

‘‘సిక్సరే కొట్టాను గానీ, నాన్నా ......’’ నాన్చాడు రవి.

‘‘ఏమైంది?’’ వెంటనే అడిగారాయన ఏదో ట్రబుల్‌ని పసిగడుతూ.

‘‘బాల్ బాగా పైకి ఎగిరి గ్రౌండ్ దాటి.......’’

‘‘ఆఁ దాటి?’’

‘‘రోడ్ మీద ఉన్న మన అసోసియేషన్ సెక్రటరీగారి కారు మీద పడింది. కారుకి సొట్ట’’ అన్నాడు రవి అతి కష్టం మీద నవ్వాపుకుంటూ.

‘‘పెద్ద వాళ్ళెవరైనా చూశారా?’’ గబుక్కున అడిగారు గోపాంగారు.

‘‘లేదు గానీ, సెక్రటరీగారి అబ్బాయి వినయ్ చూసేశాడు. బౌలింగ్ చేసింది వాడే!’’

‘‘అయితే సెక్రటరీ సబిత మనింటి మీదకి వస్తుంది. మీ అమ్మని వదుల్తాను. యుద్ధంలో గెలుపు రావాలంటే మీ అమ్మే గతి. నువ్వెళ్ళి అక్కని పిల్చుకురా’’ అన్నారు గోపాలంగారు.

హమ్మయ్య తిట్టలేదు నయం! అనుకుని రవి బయటకి వెళ్ళాడు బ్యాట్, స్టంప్ ఒక మూల పడేసి.

‘పీపీ’ ఫ్లాట్స్‌లో ఆరు ఫ్లోర్లు ఉన్నాయి. ఒక్కొక్క అంతస్తులో నాలుగు ఫ్లాట్స్. ఈ ఫ్లాట్స్‌లో ఉన్న ఇరవై నాలుగు కుటుంబాలు కలిపి ఒక అసోసియేషన్ ప్రారంభించారు. దానికో ప్రెసిడెంట్, ఒక సెక్రటరీ ,నలుగురు కమిటీ మెంబర్లు ఉన్నారు. వీళ్ళంతా అందరి బాగోగులు చూస్తుంటారు. రూల్స్ ప్రకారం అందరు తమ బాగోగులు ముందు చూసుకొని తర్వాత ఇతరుల గురించి ఆలోచిస్తారు. అంటే ప్రాంతీయ రాజకీయ పార్టీల వంటి వ్యవహారమన్న మాట!

సెక్రటరీ సబితకు ముప్పై అయిదేళ్ళు. ఆమె ఈ మధ్యే ఇండియాకు వచ్చింది. ఇన్నాళ్ళూ దుబాయ్‌లో భర్తతో ఉంది. భర్త ఉద్యోగం కాంట్రాక్ట్ మీద టైమ్ గడిచి పూర్తయ్యింది. అతడు ఇంజనీర్. అయితే అతని ప్రాజెక్ట్ వర్క్స్ ఇంకా పూర్తవలేదు. త్వరలో పూర్తవుతుంది. అందుకని ఉద్యోగంలో ఎక్స్‌టెన్షన్ మీద కొన్ని నెలలింకా ఉండాలి. తను ఇండియాకి త్వరలో వచ్చేస్తున్నాను కదా అని ముందు భార్యని, పిల్లాడిని పంపించేశాడు. సబితకి దుబాయ్‌లో ఎటువంటి వ్యాపకాలు, పరిచయాలు, స్నేహాలు లేవు. భాష తెలీదు. అందుచేత తన ఫ్లాట్‌లోనే వీడియో చూస్తూ మనలోకం తీరు తెలీకుండా ఉండిపోయింది.

‘‘పీపీ’’ ఫ్లాట్స్‌లో ఎవరు పని చేస్తే వాళ్లని అసోసియేషన్ సెక్రటరీని చేసేస్తారు.

సబిత మనదేశం, మనవాళ్ళు, వీళ్ళకోసం, ఈ పదిమంది కోసం పనిచెయ్యాలి అని ఉత్తమ ఆశయాలతో సెక్రటరీగా ఉండడానికి అమాయకంగా ఒప్పుకుంది.

‘దొరికిందో వెర్రి బాగుల్ది’ అనుకుని అందరూ ఆమెని ఆమె ఆశయాల్ని పైకి మాత్రం పొగిడేసి, గబగబా పని చేయించుకోసాగారు. •

ఆవిడ తన కొడుకు వినయ్ ద్వారా రవి చేసిన సిక్సర్ ఘన కార్యం విని, తన కారు నొక సారి పరీక్షించింది.

‘‘లోతైన సొట్టే, దీన్ని తీయించాలంటే కనీసం యాభై రూపాయలవుతుంది. వెళ్ళి గోపాలం గారిని అడుగుతాను’’ అని బయల్దేరింది.

ఈ లోపల గోపాలం గారు భార్యని పిలవడానికి ఇంకో పెడబొబ్బ పెట్టారు.

పొయ్యి మీద చారులా మరుగుతూ శాంత వచ్చింది.

